20లోగా దరఖాస్తులు అందజేయాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులు, దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేసిన వ్యక్తులు, సంస్థలు రాష్ట్రీయ దివ్యాంగుల సాధికారిత అవార్డు కోసం ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు తెలిపారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను సమర్పించాలని, హైదరాబాద్‌లో జరగనున్న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9440852495 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మంథనిలో టీటీడీ ఆలయ నిర్మాణం

మంథని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంథనిలో తిరుమల-తిరుపతి దేవస్థానానికి అనుబంధంగా వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించినున్నట్లు టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్. నాయుడు ప్రకటించారు. బోర్డు చైర్మన్‌గా నాయుడు బాధ్యతలు స్వీకరించి యేడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రంలో టీటీడీకి అనుబంధంగా మంథని, కరీంనగర్, సిద్ధిపేట జిల్లా దుబ్బాకలో వేంకటేశ్వరస్వామి ఆలయాలను నిర్మించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రతిపాదన మేరకు మంథనిలో ఆలయాన్ని నిర్మించాలని టీటీడీ బోర్డులో నిర్ణయం తీసుకున్నారు. ఆలయ నిర్మాణం కోసం 10 ఎకరాల్లో స్థలాన్ని కేటాయించడానికి పట్టణ శివారులోని బైపాస్ రోడ్డు, మంథని-పెద్దపల్లి ప్రధాన సమీపంలో స్థలాలను పరిశీలిస్తున్నారు. స్థలం ఎంపిక పూర్తయితే రెండేళ్లలో ఆలయం నిర్మిస్తారు.

- సీసీఐ నిబంధనలతో పేరుకుపోయిన పత్తి
- నిండాముంచిన మొంథా తుఫాను
- భారీ వర్షాలు, గాలులతో నేలవారిన పొలాలు
- పత్తి, వరికి తేమ నిబంధనలు
- అన్నదాతల కష్టాల సాగు

రైతులకు కొనుగోలు కష్టాలు


నేలకొరిగిన వరి పొలం, నిల్వ ఉన్న పత్తి

సుల్తానాబాద్/ముత్తారం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ సీజన్‌లో పత్తి, వరి రైతులకు కాలం కలసి రావట్లేదు. పత్తి సాగు చేయడం ఒక ఎత్తయితే విక్రయించుకోవడం మరో సమస్యగా మారింది. ఒక సీజన్‌లో పత్తికి రేటు ఉంటే మరో సీజన్‌లో పడిపోతున్నది. వానాకాలం సీజన్‌కు సంబంధించి పత్తి పంట అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. పంట చేతికందే సమయంలో వాతావరణంలో మార్పుల కారణంగా అకాల వర్షాలతో దెబ్బతిన్నది. పత్తి రంగు మారడం, సరైన ధర రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అరకొరగా వచ్చిన దిగుబడిని విక్రయించేందుకు సీసీఐ నిబంధనలు రైతులకు తీవ్ర నిరాశ కలిగిస్తున్నాయి. సీసీఐ నిబంధనలు చూస్తే నెలరోజుల్లో పత్తి అమ్ముకునే పరిస్థితి కానరావడం లేదు. రైతు సాగు చేసిన ఎకరం పత్తిలో 7 క్వింటాళ్ల దిగుబడినే సీసీఐ కొనుగోలు చేస్తోంది. గతంలో ఎకరానికి 12 నుంచి ఆపై క్వింటాలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం మద్దతు ధరను చెల్లించింది. ప్రస్తుత సీజన్‌కు కేవలం 7 క్వింటాళ్ల మాత్రమే తీసుకుంటానని మెలిక పెడుతూ ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. దీంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది.

జిల్లాలో 48 వేల రెండు వందల ఎకరాల్లో రైతులు పత్తిపంటను సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. 45 వేల ఎకరాల్లో రైతులు సాగు చేసిన పత్తిపంట ఐదున్నర లక్షల క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా. ఈ దిగుబడులను మూడు నియోజకవర్గాల పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో విక్రయించుకోవడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. రైతులకు అనుకూలంగా సమీప కేంద్రాలలో, సీసీఐ సహకారంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకలువల, పెద్దపల్లి మండలం రాఘవాపూర్, నిమ్మనపల్లి, నిట్టూరులో, మంథని నియోజకవర్గంలోని కమాన్‌పూర్ మండలం గొల్లపల్లిలో జిన్నింగ్ మిల్లుల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులు సీసీఐ నిబంధనలకు లోబడి సెంటర్లకు తీసుకురావాలని సూచిస్తున్నారు. అకాల వర్షాలతో పత్తి తడిసి రంగు మారింది. కొనుగోలు

(మిగతా 8వ పేజీలో)

• వరి రైతుల అరిగోస

పంట కోతల వేళ భారీ వర్షాలు, గాలులతో రైతులు అరిగోస పడుతున్నారు. పంట చేతికొచ్చిన సమయానికి మొంథా తుఫాన్ రూపంలో అన్నదాతను నట్టేట ముంచింది. ఈ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, గాలులకు పొలాలు నేలకొరిగి నీరు నిలిచింది. దీంతో కోత కోసేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వీల్ హార్వెస్టర్లు పొలంలో దిగబడుతుండటంతో చైన్ యంత్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో చైన్ యంత్రాలకు డిమాండ్ పెరిగింది. మిషన్ల రేట్‌ను కూడా పది శాతం పెంచి గంటకు రూ.3 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. అసలే పంట దిగుబడి వస్తుం దోరాదో నని ఆందోళన మధ్య రైతులు ఇబ్బందులు పడు తుంటే హార్వేస్టర్ల రేట్లు తడిసి మోపడవుతున్నా యని ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు నేల వాలిన పొలాలను కూలీలతో కోయించే పరిస్థితి ఏర్పడింది.

వసతి గృహాల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలి


సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సంక్షేమ వసతి గృహాల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థుల భర్తీకి చర్యలు చేపట్టాలన్నారు. పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రీ పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్‌షిప్ దరఖాస్తుల సంఖ్య పెంచాలన్నారు. వసతి గృహ సంక్షేమ అధికారులు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు చేసుకునేలా చూడాలన్నారు. జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్, సహాయ సంక్షేమ అధికారి శ్రావణ్ కుమార్, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్

కమాన్‌పూర్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యం ఏర్పరుచుకొని ఏకాగ్రతతో చదివితే గమ్యం చేరుకోవడం సులభమవుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. గురువారం జూనియర్ కళాశాలలో సైబర్ క్రైంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ వల్ల సైబర్ మోసాలు సులువుగా జరుగుతున్నాయని, తల్లిదండ్రులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకుల పేరుతో లోన్‌లు, ఓటీపీలు, ఫ్రాడ్ కాల్స్‌పై వివరించారు. ఎవరైనా సైబర్ మోసాల బారిన పడితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని, మీరు కూడా చదువుపై శ్రద్ధ పెట్టి, ఉన్నత స్థాయిలోకి రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గంజాయి, సిగరేట్లు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. డీసీపీలు కరుణాకర్, రమేష్, సైబర్ క్రైమ్ డీఎస్పీ రంగారెడ్డి, గోదావరిఖని టూ టౌన్ సీఐ ప్రసాద్ రావు, ఎస్ఐ కొట్టె ప్రసాద్ పాల్గొన్నారు.

మస్టర్ల నిబంధనను వెనక్కి తీసుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం ఇటీవల 150మస్టర్లు ఉంటేనే రెగ్యులరైజేషన్ చేస్తామని తీసుకువచ్చిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్టోబరు 23న యాజమాన్యం విడుదల చేసిన సర్క్యులర్ ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. నెలలో 19మస్టర్లు ఉండాలని నోటీసు బోర్డులో వేయడం కార్మికులను ఆందోళనకు గురి చేస్తుందన్నారు. సంవత్సరకాలమంతా పని చేసి కేవలం ఒక నెలలో సర్ఫేస్ అయితే 20, అండర్ గ్రౌండ్ అయితే 16కు తక్కువ మస్టర్లు ఉన్న కార్మికులను పిలిచి బెదిరించడంతో కార్మికులు మనో ధైర్యాన్ని కోల్పోతున్నారన్నారు. ఈ నిబంధనను వెంటనే తొలగించాలన్నారు.

ఎడెనిమిది నెలలుగా మెడికల్ బోర్డు పెట్టడం లేదని, దీంతో రెండు సంవత్సరాల సర్వీస్ నిబంధన ఉన్న కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సింగరేణిలో వీఆర్ఎస్ కాకుండా సీఆర్ఎస్‌ను తీసుకువచ్చి కార్మికులను కంపెనీ నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. దీనిపై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, కోశాధికారి చెల్పూరి సతీష్, జాయింట్ సెక్రెటరీ పానుగంటి సత్తయ్య, నాయకులు పొగాకు రమేష్, రొడ్డ సంపత్, వాసర్ల జోసెఫ్, అన్వేష్, పల్లె సురేందర్, మురళీకృష్ణ, వెంకటిరెడ్డి, రమేష్, పులిపాక శంకర్, నరేష్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామ దేవతల కట్టడాల తొలగింపు..



కూల్చివేసిన పోచమ్మ, మైసమ్మ గుడులు, ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

కోల్‌సిటీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని రహదారుల డివైడర్లు, రోడ్ల పక్కన కూడళ్ల ప్రాంతాల్లో గ్రామ దేవతలను పూజించేందుకు నిర్మించిన కట్టడాలను రామగుండం నగర పాలక యంత్రాంగం గురువారం తెల్లవారుజామున కూల్చివేసింది. కార్పొరేషన్ సిబ్బంది ఎక్స్‌కావేటర్లు, ట్రాక్టర్లతో సుమారు 40కిపైగా కట్టడాలను తొలగించారు.

దీనిపై బీజేపీ, దాని అనుబంధ సంఘాలు, హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కూల్చివేసిన దారి మైసమ్మ గుడిని పునర్నిర్మిస్తామంటూ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక నాయకులు అయోధ్య రవీందర్, సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ అర్ధరాత్రి మైసమ్మ గుళ్లను తొలగించి మెజార్టీ హిందువుల మనోభావాలను దెబ్బతీశారని, దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ సొంత ఖర్చులతో వీటిని పునర్ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాంమూర్తి, సత్యం, అంజన్న, అడిగొప్పుల రాజు, మేరుగు హన్మంతుగౌడ్, కోమళ్ల మహేష్, మునగాల రాజు, కొండపర్తి సంజీవ్, ముస్కుల భాస్కర్‌రెడ్డి, పిడుగు కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్


ప్రిన్స్‌పాల్ చేతుల మీదుగా షీల్డ్ అందుకుంటున్న క్రీడాకారులు

రామగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్‌యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ మేరా యువ భారత్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మంథని జేఎన్‌టీయూ కళాశాలకు చెందిన విద్యార్థులు 8 ఈవెంట్స్‌లలో బహుమతులు సాధించారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, సునీల్‌కుమార్, పరిపాలనాధికారి చినాల సుమన్‌రెడ్డి, విభాగాల ఇంచార్జిలు శ్రీనివాస్‌రావు, మహేందర్, శివరామకృష్ణ, నవ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

15న లోక్ అదాలత్


సమావేశంలో పాల్గొన్న జడ్జీ, న్యాయవాదులు

సుల్తానాబాద్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ కోర్టులో ఈ నెల 15న స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ తెలిపారు. గురువారం బార్ అసోసియేషన్ న్యాయవాదులతో జడ్జి సమావేశం నిర్వహించారు. కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని కేసులను రాజీ చేసుకోవాలన్నారు. మూడేళ్లలోపు శిక్ష పడే క్రిమినల్ కేసులు, కుటుంబ వివాదాలు, భూమి తగాదాలు, ప్రమాదాలు, చెక్ బౌన్స్ కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఏజీపీ దూడం ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి భూమయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

కళాశాలలను తనిఖీ చేసిన ఇంటర్ బోర్డు ప్రత్యేకాధికారి




బాలికల కళాశాలలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమణారావు

కోల్‌సిటీటౌన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలోని బాలికల, బాలుర జూనియర్ కళాశాలలను గురువారం ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక అధికారి రమణారావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలల, విద్యార్థుల పురోగతిపై ప్రిన్సిపల్స్, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా సమయాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలను సాధించడంపై పలు సూచనలు చేశారు. ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ విద్యావిధానం అధ్యాపకుల, తల్లిదండ్రుల సమావేశాల ఏర్పాటు, విద్యా సంవత్సరం ఇప్పటివరకు జరిగిన పరీక్షలలో విద్యార్థుల పురోగతి విద్యార్థుల హాజరు శాతం తదితర అంశాలపై చర్చించారు.

పారిశ్రామికాభివృద్ధిలో ఎన్టీపీసీ కీలకం

- నేడు ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం
- బహుళ రంగాల్లో ప్రగతి



ఎన్టీపీసీ ఆవిర్భావంతో దేశీయ విద్యుత్ రంగంలో నూతన శకం ఆరంభమైంది. 1975 నవంబరు 7న నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) పేరుతో పబ్లిక్ సెక్టార్ సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అలా ప్రారంభమైన ఎన్టీపీసీ ప్రస్థానం ప్రస్తుతం దేశం మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో నాల్గవ వంతుకుపైగా (84,849 మెగావాట్లు) ఉత్పత్తి చేస్తోంది. ఎన్టీపీసీ నాలుగు దశాబ్దాల్లో బహుళ వ్యాపార రంగంలో అడుగుపెట్టింది. థర్మల్, గ్యాస్, జల విద్యుత్, సోలార్ విద్యుత్ ఉత్పత్తితోపాటు బొగ్గు గనుల నిర్వహణ, గ్యాస్ నిక్షేపాల అన్వేషణ చేపట్టింది. ఇలా అంచెలంచెలుగా ఎదిగిన ఎన్టీపీసీ శుక్రవారం 50 ఏళ్లు పూర్తి చేసుకోనుంది

అర్ధాంతరంగా నిలిచిపోయిన మినీ గోదాం పనులు

- పదేళ్లయినా పూర్తి కానీవైనం
- పట్టించుకోని అధికారులు

ముత్తారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లిలో నిర్మిస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల గిడ్డంగి, ధాన్యం ఆరబెట్టే ప్లాట్‌ఫాం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. 2015లో ప్రారంభించినా ఇప్పటికీ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. పదేళ్ల పూర్తవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వం వల్ల ఈ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 2014-15లో మినీ గోదాం నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. 2015లో అప్పటి మంథని ఎమ్మెల్యే పుట్ట మధుకర్ గోదాం పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అయితే మూడు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని నిర్ధేశించినా ఆ పనులు ఇంకా పూర్తి కాలేదు. గోడల నిర్మాణం చేపట్టి, వాటికి షెటర్లను ఏర్పాటు చేసి, పైకప్పు నిర్మాణం సమయంలో పనులు ఆగిపోయాయి. మినీ గోదాం పూర్తయితే ఇక్కడ ఏర్పా టు చేసే కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని వర్షాలు పడ్డా తడవ కుండా దాచుకునే అవకాశం ఉండేది. గోదాం నిర్మాణం జరగని కారణంగా రైతులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన సమయంలో వర్షం పడి ధాన్యం తడిసి ముద్దవుతోంది. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం వల్ల గోదాం నిర్మాణం జరగకపోవడం రైతుల పాలిట శాపంగా మారుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గోదాం నిర్మాణం పూర్తి చేయించి, అందు బాటులోకి తేవాలని రైతులు వేడుకుంటున్నారు.


అసంపూర్తిగా నిలిచిపోయిన గోదాం

గోదాం నిర్మాణం పూర్తి చేయాలి

- జంబోజు రమణయ్య, రైతు, ఖమ్మంపల్లి



గోదాం నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. త్వరగా పూర్తి చేయాలి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే వర్షానికి తడిసి ముద్దవుతున్నాయి. గోదాం పూర్తయితే ధాన్యం నిలువ చేసే అవకాశం ఉంటుంది.

గోదాం నిర్మాణానికి త్వరలో చర్యలు

- జగదీష్, ఏఈ, పంచాయతీ రాజ్



ఆగిపోయిన గోదాం నిర్మాణ పనులకు సంబంధించి చర్యలు తీసుకుంటాం. దీనికి సంబంధించి ఎస్టిమేషన్ వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో పనులు చేపట్టేలా చూస్తా.

భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం



భీమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు

వేములవాడ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో కార్తీక మాసంలో భాగంగా గురువారం రాత్రి కార్తీకదీపోత్సవం నిర్వహించారు. ఈ దీపోత్సవంలో భాగంగా సుహాసినులు దీపాలను వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు. ఈ సందర్భంగా భక్తి గీతాలు, భజనలతో అలరించారు. కార్తీకదీపోత్సవంలో పాల్గొన్న సుహాసినులకు పసుపుకుంకుమ, అక్షింతలు, గాజులు, స్వామివారి ఫోటోతో కూడిన వాయినంను ఏఈవో అశోక్ అందజేశారు. ఈ ఉత్సవాల్లో సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ సాయి, గట్టు గౌతం, అర్చకులు పాల్గొన్నారు.

చిట్టీల వ్యాపారి అరెస్ట్

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధిక డబ్బులు వస్తాయని ఆశజూపి ప్రజల వద్ద నుండి చిట్టీల పేరున నిలువు దోపిడిచేసిన వ్యాపారిని పెద్దపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి పట్టణంలో సుమారు 40మంది నుండి నెలనెలా డబ్బులు తీసుకొని ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడ్డాడు. డిసెంబర్ నుండి తప్పించుకొని తిరుగుతున్న పెద్దపల్లి భరత్‌నగర్‌కు చెందిన ఠాకూర్ హనుమాన్ ప్రసాద్ కోసం ప్రత్యేకంగా టీమ్‌ను ఏర్పాటు చేసి గురువారం అరెస్టు చేశారు. అతని బాధితులు ఎవరైనా ఉంటే పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.



వ్యాపారి అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

వంతెన పూర్తయ్యేదెన్నడో?

- రెండు నియోజకవర్గాల మధ్య రాకపోకలకు కీలకం
- అసంపూర్తిగా నిర్మాణ పనులు..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు

బోయినపల్లి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రెండు నియోజకవర్గాలను కలిపే వంతెన నిర్మాణానికి పట్టిన గ్రహణం వీడడం లేదు. ఈ వంతెన చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని గ్రామాల మధ్య రాకపోకలకు కీలకమైనది. వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టరేట్ వరకు పాదయాత్ర, బైక్ ర్యాలీ, ఆందోళనలు చేపట్టినా నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో ప్రభుత్వ తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బోయినపల్లి మండల కేంద్రం నుంచి వేములవాడ పట్టణానికి వెళ్లే దారిలో గంజి వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి గతంలో ప్రారంభమయ్యాయి.అయితే కాంట్రాక్టర్ వంతెన నిర్మాణంలో భాగంగా పిల్లర్లు వేసి మధ్యలో నిలిపివేశాడు. చేసిన పనులకు లక్షలకు ఎంబీ రికార్డు అయినా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతోనే సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేసినట్టు సమాచారం. పనులను పూర్తిచేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీచేశారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో కొద్దిపాటి వర్షానికి గంజి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచిపోతాయి. బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని పలుమార్లు ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశారు. పలుమార్లు ఆందోళనల తర్వాత అధికారులు వంతెన పక్కన తాత్కాలిక రోడ్డు వేయించారు. ఇటీవల కురిసిన వర్షానికి తాత్కాలిక రోడ్డు సైతం దెబ్బతిన్నది. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి మధ్యలో నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



పాదయాత్ర చేస్తున్న ప్రజలు (ఫైల్)

ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు..



– అక్కనపల్లి కరుణాకర్, స్తంభంపల్లి

గంజివాగు హైలెవెల్ వంతెన నిర్మాణానికి సంవత్సరాలు గడుస్తున్నా పనులు ముందుకు లేదు. పనుల పూర్తికి కలెక్టరేట్ వరకు పాదయాత్రతో పాటు బైక్ ర్యాలీ నిర్వహించి ఆందోళనలు వ్యం చేశాం. అయినా పనులు ముందుకు సాగడం లేదు.

వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలి..



– బొంగోని అశోక్, స్తంభంపల్లి

కొద్దిపాటి వర్షానికి గంజి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు వేములవాడ పట్టణానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం స్పందించి వంతెన పనులు పూర్తి చేయాలి.

కాంట్రాక్టు రద్దుకు ప్రభుత్వానికి నివేదిక పంపించాం..

– కె విష్ణువర్ధన్, పీఆర్ డీఈ

పనులు పొందిన కాంట్రాక్టర్ నోటీసులు జారీచేసిన పనులను పూర్తి చేయడంలేదు. దీంతో కాంట్రాక్టు రద్దుకు ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ఆదేశాలు రాగానే మళ్లీ టెండర్ పిడిచి పనులను పూర్తి చేయిస్తాం.

టిప్పర్ సీజ్



టిప్పర్‌ను సీజ్ చేస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ చౌరస్తాలో గురువారం అడిషనల్ ఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో డస్ట్ తీసుకెళుతున్న టిప్పర్‌ను సీజ్‌చేశారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎంవీయాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లు అందజేత

కరీంనగర్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో కమటం సాయికుమార్ అనే వ్యక్తి మార్చి 2వ తేదీన తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుని రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆఫోన్ జగిత్యాలలో ఉన్నదని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. గురువారం బాధితుడు సాయికుమార్‌ను స్టేషన్‌కు పిలిపించిన రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి ఫోన్‌ను అప్పగించారు. ఈ ఫోన్‌ను రికవరీ చేయడంలో కృషిచేసిన కరీంనగర్ రూరల్ కానిస్టేబుల్ కీర్తనను రూరల్‌సీఐ నిరంజన్ రెడ్డి అభినందించారు.

శంకరపట్నం: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బాధితుడికి కేశవపట్నం ఎస్ఐ శేఖర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్‌లో అప్లోడ్ చేయగా, వాటిని గుర్తించి పోగొట్టుకున్న ఇప్పలపల్లికి చెందిన ఓదెల కార్తీక్‌కు అందజేసినట్లు తెలిపారు.

జల్సాలకు అలవాటుపడి.. చోరీలకు పాల్పడి..

- విద్యుత్ మోటార్లు, వైర్ల దొంగల అరెస్ట్



దొంగల అరెస్టును చూపుతున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

ముస్తాబాద్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపిన కథనం మేరకు ముస్తాబాద్ మండలంలోని బందనకల్ శివారులో వాహన తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోపెడ్‌పై అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన పర్వతం శ్రీను, నూనే సాయికుమార్‌లుగా గుర్తించారు. వీరు పాతఇనుప సామను కొనుక్కొని అమ్మగా వచ్చినడబ్బుల ద్వారా కుటుంబాలను పోషించుకునేవారు. జల్సాలకు, కుటుంబ పోషణకు డబ్బులు సరిపోవడం లేదని ఎలాగైనా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో విద్యుత్ మోటార్‌లు, వైర్‌ను రాత్రి సమయంలో దొంగిలించాలనే ఆలోచనకు వచ్చి గజ్వేల్‌కు చెందిన బడే అనిల్, మోతే సాయిలుతో తమ ఆలోచనను పంచుకున్నారు. వారు కూడా అంగీకరించడంతో తెర్లుమద్ది శివారులోని అర్జున్ క్రషర్‌లో నెలరోజుల క్రితం మూడు సెల్ ఫోన్‌లు ఎత్తుకెళ్లారు. అదేరోజున తిరుమల రైస్ మిల్‌లో 4విద్యుత్‌మోటర్‌లు, 20 రోజుల అనంతరం మళ్లీ అర్జున్ స్టోన్ క్రషర్‌లోకి రాత్రిపూట ప్రవేశించి ఏడు టిప్పర్ బ్యాటరీలు, ట్రాక్టర్ బ్యాటరీ ఇతర ఇనుప వస్తువులు ఎత్తుకెళ్లారని తెలిపారు. అలాగే మండలంలోని పోత్గల్, మద్దికుంట, చీకోడ్, మోర్రాపూర్, గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్దగల విద్యుత్ మోటార్లు, వైర్లు ఎత్తుకెళ్లారని వివరించారు. వారి వద్ద ఉన్న మోటార్లు, బ్యాటరీలు స్వాధీనం చేసుకొన్నామని, వాటి విలువ దాదాపు రూ4 లక్షలు ఉంటుందన్నారు. పర్వత శ్రీను, నూనే సాయికుమార్ లను పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మిగతా నేరస్థులు పరారీలో ఉన్నారని తెలిపారు. దొంగతనాలను చేధించిన ఎస్సై సీహెచ్ గణేశ్, పీసీలు ఎండీ ఖాసీం, రాజశేఖర్, టి నరేశ్‌లను డీఎస్పీ అభినందించారు.

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో..

చికిత్స పొందుతూ ఐదుగురు మృతి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో వివిధ సందర్భాల్లో గాయపడి, ఆత్మహత్యాయత్నం చేసుకుని చికిత్స పొందుతున్న ఐదుగురు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..

ఎల్బాకలో..

వీణవంక, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన తప్పెట అనిల్(26) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గతనెల 24వ తేదీన అనిల్‌ను అదేగ్రామానికి చెందిన బొట్ల అరవింద్ మరికొందరితో కలిసి గ్రామ చివరున రైస్‌మిల్లు వద్దకు తీసుకెళ్లారు. వారు మద్యం తాగారు. కాగా అనిల్‌కు అరవింద్ తమ్సప్‌లో గడ్డిమందు కలిపి తాగించాడు. దీంతో వాంతులు కాగా గ్రామంలోని ఆర్ఎంపీ దగ్గరకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు అనిల్ తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పురుగుల మందు తాగి..

పెద్దపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోజన్నపేట గ్రామానికి చెందిన సింగిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి(44) చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొంతకాలంగా ఎలాంటి పని చేయకుండా ఖాళీగా ఉండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో రాజేశ్వర్‌రెడ్డి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

కోల్‌సిటీ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం ఆఫీస్ బీ గెస్టహౌస్ కార్నర్ రాజీవ్ రహదారిపై ఈ నెల 3న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎల్ఐసీ ఏజెంట్ రౌతు రాజన్న(56) చికిత్స పొందుతూ గురువారం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందినట్టు వన్‌టౌన్ ఎస్ఐభూమేష్ తెలిపారు. రాజన్నబైక్‌పై గోదావరిఖని నుంచి మంచిర్యాల వైపు వెళుతుండగా బీ గెస్టహౌస్ కార్నర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. అతని పరిస్థితివిషమంగా ఉండడంతో కరీంనగర్‌ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. చికిత్సపొందుతూ గురువారంమృతిచెందాడు. మృతుడికుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్టుపోలీసులు పేర్కొన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసి..

కరీంనగర్ క్రైం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కరీంనగర్‌రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన ముస్కు శివ(25) అనే యువకుడు చికిత్సపొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శివకు 11 నెలల క్రితం వివాహం జరిగింది. కొన్నినెలల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్న శివ ఎన్ని ఆసుపత్రుల్లో చూపించుకున్నా నయంకాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈనెల1వ తేదీన మొగ్దుంపూర్ గ్రామ శివారులో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు అతడిని అదేరోజున కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడిశివ తండ్రి నారాయణ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ సీఐ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై..



ఎల్లుట్ల కృష్ణ(ఫైల్)

కోరుట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలో నాలుగు నెలలక్రితం విద్యుదాఘాతానికి గురైన ఎల్లుట్లకృష్ణ (33) గురువారం చికిత్సపొందుతూ మృతి చెందాడు. పట్టణంలో వినాయకవిగ్రహాల తయారీ కేంద్ర వద్ద జూన్15న విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందగా 8మందికి గాయలయ్యాయి. ప్రమాదంలో ఎల్లుట్ల కృష్ణ గాయపడగా కుటుంబసభ్యులు అప్పుడు చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. కొద్దిరోజుల అనంతరం డిశ్చార్జ్ అయ్యాడు. కానీ అతడికి అయిన గాయం మానకపోవడంతో జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో చికిత్సను అందించారు. గురువారం మధ్యాహ్నం తీవ్రఅస్వస్థతకు గురై చికిత్సపొందుతూ మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం అపహరణ

జగిత్యాలరూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ పాటిమీది మల్లన్న సమీపంలో గల ఆంజనేయ పురాతన విగ్రహాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్లు కల్లెడ గ్రామస్థులు తెలిపారు. ఈవిషయమై గ్రామపంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

రౌడీ షీటర్లకు సీఐ కౌన్సెలింగ్

జ్యోతినగర్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో పలువురు రౌడీ షీటర్లకు రామగుండం సీఐ గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ మంచి ప్రవర్తనను కలిగి ఉండాలని తెలిపారు. ఎలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పకుండా తమ పనులు చేసుకోవాలని, ప్రజలను ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సబ్ రిజిస్ట్రార్‌పై కొనుగోలుదారుడి ఆగ్రహం

- ఒకే సర్వేనంబర్‌లో ఒకటి చేసి మరొకటి రిజెక్ట్
- ఎన్‌వోసీ తీసుకొచ్చినా చేయని వైనం



ఆందోళన చేస్తున్న భూమయ్య

గంగాధర, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగాధర అదనపు బాధ్యతలు చేపడుతున్న సబ్‌రిజిస్ట్రార్ కావాలని రిజిస్ట్రేషన్లను తిరస్కరిస్తున్నాడని కొనుగోలుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన రేణిగుంట భూమయ్య అదేగ్రామంలో సర్వే నంబర్ 371బి15లో 232 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. అయితే ఈనెల 3న డాక్యుమెంటుతో గంగాధర రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు వచ్చాడు. పరిశీలించిన సబ్‌రిజిస్ట్రార్ ఈ నంబర్లు నిషేదిత జాబితాలో ఉన్నాయని, జిల్లా కలెక్టర్ నుంచి ఎన్‌వోసీ తీసుకువస్తే చేస్తానని భూమయ్యకి తెలిపాడు. దీంతో భూమయ్య రామడుగు తహసీల్దార్ నుంచి ఈ నంబరుపై ఎన్‌వోసీ తీసుకువచ్చాడు. గురువారం కార్యాలయానికి వచ్చిన భూమయ్య రిజిస్ట్రేషన్ చేయాలని సబ్‌రిజిస్ట్రార్‌ను కోరాడు. ఇది నిషేదిత జాబితాలో ఉంది నేను చేయనని డాక్యుమెంటును తిరిగి పంపించాడు. దీంతో భూమయ్య సబ్ రిజిస్ట్రార్‌తో ఇదే సర్వేనంబరులో 18ఆగస్టు 2025న మీరేడాక్యుమెంటు రిజిస్ట్రేషన్ చేశారు, నాది ఎందుకు చేయడంలేదని వాగ్వాదానికి దిగాడు. అయితే డబ్బులు ఇవ్వనందుకే రిజిస్ట్రేషన్ చేయడంలేదని భూమయ్య ఆరోపిస్తున్నాడు. దీనిపై సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఈ సర్వేనంబరు నిషేదిత జాబితాల్లో ఉంది. చేయడానికి నా పరిధి కాదు అయినా చేయాలని డిమాండ్ చేశాడు. నేను ఎవరిని ఎలాంటి ప్రలోభాలకు గురి చేయలేదన్నాడు.

లారీ ఢీకొని యువకుడికి గాయాలు

మంథని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గంగాపురి వద్ద లారీ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో స్థానిక పోచమ్మ వాడకు చెందిన లక్కాకుల సంతోష్ అనే యువకుడు బుధవారం సాయంత్రం గాయపడ్డారు. గంగాపురిలో తనపని ముగించుకొని బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో మంథని నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో సంతోష్ గాయ పడ్డాడు. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య



నీరటి రాజు(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): గంగారం గ్రామానికి చెందిన నీరటి రాజు(30) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి పోచమ్మ తెలిపిన వివరాల మేరకు రాజు అతిగా మద్యం తాగేవాడు. రాజు భార్య ఈనెల3న ఇద్దరు కుమారులను తీసుకొని తల్లిగారి ఊరైన ముత్తారం మండలం పారుపల్లికి వెళ్లింది. మద్యం మత్తులో గురువారం గంగారంలో ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ వెంకటేష్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

- తల్లి ఆత్మహత్య ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదని మల్యాలలో యువకుడు
- పాస్‌పోర్టు ఇవ్వడం లేదని జగిత్యాలలో మరో యువకుడి ఆత్మహత్యాయత్నం



పోలీస్‌స్టేషన్ గేట్‌పై పెట్రోల్ డబ్బాతో ఉన్న మహ్మద్ అఖిల్‌ను ఆపుతున్న సిబ్బంది

మల్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మల్యాల పోలీస్‌స్టేషన్ మెయిన్‌గేట్ ఎక్కి మహ్మద్ అఖిల్ అనే యువకుడు గురువారం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో వెంటనే పోలీసులు, ఇతరులు పెట్రోల్ డబ్బా లాక్కొని ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా మహ్మద్ అఖిల్ మాట్లాడుతూ తన తల్లి అన్వరీబేగం ఆత్మహత్య ఘటనకు కారకులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించాడు. మల్యాల మండలం నూకపల్లి అర్బన్‌హౌసింగ్ కాలనీకి చెందిన అన్వరీబేగం గత నెల 9న ఆత్మహత్యకు పాల్పడింది. అయితే తన తల్లి ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులు, కారకులైన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, తాను ఎస్పీ దగ్గరకు వెళతానని మహ్మద్ అఖిల్ చెప్పడంతో గురువారం ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే మరికొంత మందికి కూడా తనతల్లి ఆత్మహత్యలో భాగస్వామ్యం ఉందని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని ఆత్మహత్యయత్నం చేశాడు. ఈవిషయమై మల్యాల ఎస్సై నరేశ్ కుమార్‌ను సంప్రదించగా ఆత్మహత్య ఘటనలో ఫిర్యాదు వచ్చిన వ్యక్తిపై విచారణ జరుపుతున్నామని కేసు విచారణ కొనసాగుతోందని తెలిపారు.

పాస్‌పోర్టు ఇవ్వడం లేదని యువకుడి ఆత్మహత్యాయత్నం..

జగిత్యాల టౌన్: కన్సల్టెన్సీ నిర్వాహకులు పాస్‌పోర్టు ఇవ్వడం లేదని గురువారం నిద్రమాత్రలు మింగి అయితం శ్రీకాంత్ అనే యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలం బొంకూరు గ్రామానికి చెందిన అయితం శ్రీకాంత్ జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీకృష్ణ మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ తరఫున గల్ఫ్ పంపుతా అంటే నెలరోజుల క్రితం పాస్‌పోర్టు ఇచ్చాడు. వీసా రాకముందే వైద్య పరీక్షలు చేయించుకోవాలని వారు చెప్పగా రూ.7వేలు చెల్లించి చేయించుకున్నాడు. ఆఫర్ లెటర్ అడిగితే ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ముందు ఒప్పందం చేసుకున్న విధంగా కాకుండా పనిభారం 12గంటల వరకు పెంచి, భోజన వసతి జీతంలోంచి చెల్లించాలని పేర్కొన్నారని తెలిపాడు. అలా అయితే వద్దని తన పాస్‌పోర్టు ఇవ్వాలని కోరగా తిప్పించుకుంటున్నారని ఆరోపించాడు. పాస్‌పోర్టు ఇవ్వకపోవడంతో గురువారం కన్సల్టెన్సీకి వచ్చిన శ్రీకాంత్ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటవచ్చిన కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం గురువారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి 21,954 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు వరదగేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టునుంచి 28,204 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్‌గేట్ల ద్వారా 8వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది.

అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా నీటి విడుదల

ఇల్లంతకుంట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటివిడుదల కొనసాగుతోంది. 3.5టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.43టీఎంసీల నీరు ఉంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి 100 క్యూసెక్కుల నీరు క్యాచ్‌మెంట్ ద్వారా వస్తుండగా, 118క్యూసెక్కుల నీరు సర్‌ప్లస్ గేట్ల ద్వారా విడుదల అవుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం రెండుగేట్ల నుంచి నీటివిడుదల కొనసాగుతోంది. ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటిమట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.947టీఎంసీల నీరునిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి వస్తున్న 4254క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తుండగా, రెండు స్పిల్‌వేగేట్లు ఒకఫీట్‌మేర ఎత్తి4వేలక్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరిరూపంలో 254క్యూసెక్కులు మొత్తం 4254క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది.



ఎల్‌ఎండీ నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

క్రమశిక్షణ.. దేశభక్తి

- విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాల పెంపు
- నేడు భారత స్కౌట్స్, గైడ్స్ ఫౌండేషన్ డే



తాళ్లతో నిర్మించిన బ్రిడ్జిపై శిక్షణ పొందుతున్న గైడ్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వినయం, ఔన్నత్యం, సహాయ గుణం కలగలిపి క్రమశిక్షణకు మారుపేరుగా, నైతిక విలువలకు చిరునామాగా ఏర్పడిన ఉద్యమమే స్కౌట్స్ అండ్ గైడ్స్. విద్యార్థులు, యువతలో క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యం.



స్కౌట్ శిబిరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

● నేపథ్యం

భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డేను ప్రతి సంవత్సరం నవంబర్ 7న జరుపుకుంటారు. 1950లో ఇదే రోజున దేశంలోని బాయ్ స్కౌట్స్ అసోసి యేషన్, హిందుస్థాన్ స్కౌట్ అసోసియేషన్ విలీన మయ్యాయి. అప్పటి నుంచి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటయింది. ఒక సంవత్సరం తర్వాత 1951 ఆగస్టు 15న ఆలిండియా గర్ల్ గైడ్స్ అసోసియేషన్ కూడా ఈ సంస్థలోనే చేరింది. ఈ నేపథ్యంలో నవంబర్ 7న స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డేను భారతదేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు.

● వివిధ రకాల శిక్షణలు

స్కౌట్స్ గైడ్స్‌కు పయనీరింగ్ అంటే ముడులు వేయడం, టెంట్ నిర్మాణం, వంతెనను నిర్మించడం తదితర అంశాలపై శిక్షణ అందిస్తారు. అలాగే ప్రథమ చికిత్స చేయడం, పేషెంట్లను ఎతుకెళ్లే పద్ధతులు, కృత్రిమ శ్వాస అందించడంలో శిక్షణ ఇస్తారు. మ్యాపింగ్ అండ్ కంపాస్‌లలో శిక్షణ ఇస్తారు. అంతర్జాతీయ పటాలను చదవడం, దిక్సూచి ఉపయోగించుకోవడం నేర్పిస్తారు. ఎత్తులు, లోయలు, పొడవు, వెడల్పులను అంచనా వేయడం, ట్రెక్కింగ్, శారీరక దృఢత్వానికి ఫుట్ డ్రిల్, మార్చ్‌ఫాస్ట్, యోగా వంటి వ్యాయామాలు నేర్పిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో 824 ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా స్కౌట్స్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయడానికి పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

● ఉన్నత విద్యావకాశాలు

గవర్నర్ సర్టిఫికెట్ : రాష్ట్రస్థాయి పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేస్తారు.

రాష్ట్రపతి సర్టిఫికెట్: గవర్నర్ సర్టిఫికెట్ పొందిన విద్యార్థులకు జాతీయస్థాయిలో పరీక్ష నిర్వహించి రాష్ట్రపతి సర్టిఫికెట్లు అందజేస్తారు.

ఉద్యోగ రిజర్వేషన్: రాష్ట్రపతి సర్టిఫికెట్లు సాధించిన వారికి రైల్వే సంస్థతో సహా పలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పిస్తారు.

పాఠశాల విద్యకు స్కౌట్స్ అండ్ గైడ్స్ జీవనాధారం



- షరీఫ్ అహ్మద్, ట్రైనింగ్ కమిషనర్

స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం పాఠశాల విద్యకు జీవనాధారం. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో తెలివితో పాటు వారి మనసును కూడా మలిచే ఒక జీవన పద్ధతి ఇది. తరగతి గదిలో అందని క్రమశిక్షణ, నడవడి, గౌరవభావం వంటి కీలక లక్షణాలు శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులకు అందుతాయి. పాఠశాల విద్యార్థుల్లో నేను సమాజానికి బాధ్యతగల సభ్యుడిని అనే భావనను పెంచి వారిలో దేశభక్తి, సేవాగుణం, వినయ విధేయతలను పెంపొందిస్తుంది.

పాఠశాల స్థాయిలో క్రమశిక్షణకు చిరునామా

- కంకణాల రాంరెడ్డి, జిల్లా స్కౌట్స్, గైడ్ కార్యదర్శి



స్కౌట్స్ అండ్ గైడ్స్ పాఠశాల స్థాయిలో విద్యార్థుల క్రమశిక్షణకు చిరునామాగా నిలుస్తుంది. యువత భవిష్యత్తుకు జీవన మార్గం చూపెడుతుంది. ఉత్తమ సమాజ నిర్మాణంలో విద్యార్థులు, యువత పాల్గొనేలా చేస్తుంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు స్కౌట్స్, గైడ్స్ యూనిట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. దీంతో సమర్థవంతమైన పౌరసత్వంవైపు బలంగా అడుగులు వేయగలం.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు చెల్పూర్ విద్యార్థి



గాలిబు చరణ్

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్పూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న గాలిబు చరణ్ అనే విద్యార్థి అండర్-17లో రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం ఏడుళ్ల బయ్యారం గ్రామంలో నిర్వహించే 69వ రాష్ట్ర స్థాయి పోటీలలో ఈ విద్యార్థి పాల్గొనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై పీడీ చిరుత శ్రీనివాస్, రిటైర్డు పీడీ సొల్లు సారయ్య అభినందించారు.

ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ

శంకరపట్నం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్‌లో రెండు ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. బాధితుడు జనగం రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున చూసే సరికి తన ఇంటి ముందు నిలిచిఉంచిన రెండు ట్రాక్టర్ల బ్యాటరీలు, రెండు వైబ్రేటర్లు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా ఖో-ఖో జట్ల శిక్షణ శిబిరాలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఖో-ఖో జట్ల శిక్షణ శిబిరాలు గురువారం ముగిశాయి. కరీంనగర్‌లోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ సౌజన్యంతో ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 10 రోజులపాటు మహిళలు, పురుషుల ఖో-ఖో జట్లకు నిర్వహించిన ఈ శిబిరాల్లో 25 మంది పురుషులు, 20 మంది మహిళలు పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సతీష్‌రెడ్డి, జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలకు ఎంపికైన మహిళలు, పురుషుల జట్లకు ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో క్రీడాదుస్తులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు ప్రతిభచాటి విజేతలుగా నిలవాలని అన్నారు. శిబిరాల్లో పాల్గొన్న జట్లు పెద్దపల్లి జిల్లాలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో జరగనున్న తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్స్ ఖో-ఖో పోటీల్లో పాల్గొననున్నాయి. కార్యక్రమంలో శిక్షణ శిబిరాల నిర్వాహకులు, కోచ్‌లు డాక్టర్ ఎ రవీందర్, కట్ట సంతోష్, రాములు, కరుణాకర్, చిట్టి తిరుపతిరెడ్డి, వి శ్రీలత, రేణుక, పి జ్యోతి, సౌజన్య, సూర్యప్రకాష్, పి ఆనంద్, జలంధర్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రపోటీలకు ఎంపికైన ఉమ్మడిజిల్లా మహిళలు, పురుషుల జట్లు

నేడు కరీంనగర్‌కు గవర్నర్ రాక

- 'శాతవాహన' స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరు

కరీంనగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కరీంనగర్ జిల్లాకేంద్రానికి శుక్రవారం రానున్నారు. ఉదయం 8.15గంటలకు హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి ఆయన రోడ్డు మార్గంలో బయలుదేరి 10.50గంటలకు శాతవాహన యూనివర్సిటీకి చేరుకుంటారు. అక్కడ 12.30గంటల వరకు యూనివర్సిటీ ద్వితీయ స్నాత కోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారు. అనంతరం గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులకు మెడల్స్‌ను ప్రదానం చేస్తారు. మధ్యాహ్నం 12.30గంటలకు భోజనంచేసి 1.45నిమిషాలకు బయలుదేరి రెండు గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. రెండు గంటల నుంచి 2.15గంటల వరకు స్థానికులు తయారు చేసిన హ్యాండిక్రాఫ్ట్స్, సిల్వర్ ఫిలిగ్రీ, ఆహారపదార్థాల స్టాల్స్‌ను సందర్శిస్తారు. 2.15 నుంచి మూడు గంటల వరకు అక్కడే కలెక్టర్, టీబీ అధికారులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3నుంచి 3.45గంటల వరకు రచయితలు, కవులు, కళాకారులు, వివిధ రంగాల్లో రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో అవార్డులు పొందిన అవార్డు గ్రహీతలతో గవర్నర్ ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.50 గంటలకు కలెక్టరేట్ నుంచి బయలుదేరి సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ రాజ్‌భవన్‌కు చేరుకుంటారని రాజ్‌భవన్‌వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు.

కొనసాగుతున్న గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి

ధర్మపురి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకొని గురువారం ధర్మపురి వద్ద గోదావరి హారతి నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోకక్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. రాత్రివేళలో మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్యఅర్చకులు నంబి శ్రీనివాసాచారి, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, ధర్మకర్త రాపర్తి సాయికిరణ్, శారదా మహిళా మండలి, వాసవి మహిళామండలి సభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపు సభ్యులు, పెద్దపల్లి శ్రీవల్లి సేవా గ్రూపు సభ్యులు, స్థానిక మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చొప్పదండి ప్యాక్స్‌ను సందర్శించిన పుణే విద్యార్థుల బృందం

చొప్పదండి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ప్రాథమిక సహకార సంఘాన్ని పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో-ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ విద్యాలయంలో పీజీడీఎం చదువుతున్న విద్యార్థుల బృందం గురువారం సందర్శించింది. సహకార రంగంలో వృత్తిపరమైన విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు క్షేత్రస్థాయి అనుభవాన్ని అందించే లక్ష్యంతో బృందం చొప్పదండి ప్యాక్స్‌ను సందర్శించి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్యాక్స్‌చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, జిల్లాసహకార అధికారి రామానుజచార్యులు సంఘం యొక్క కార్యకలాపాలు, పనితీరు, రైతులకు అందిస్తున్నసేవలు, సంఘంఅభివృద్ధి గురించి వివరించారు. సంఘం జాతీయ స్థాయిలో ఉత్తమ ప్యాక్స్‌గా అవార్డు అందుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ముద్దం మహేష్‌గౌడ్, సీఈవో కళ్లెం తిరుపతి రెడ్డి, సభ్యులు గుర్రం ఆనంద్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, నాంపల్లి మల్లయ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి కిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.



చొప్పదండి సహకార సంఘంలో విద్యార్థుల బృందం

యధాతథంగా పత్తి కొనుగోళ్లు

- మిల్లర్లు ఇచ్చిన బంద్ పిలుపు వాయిదా



మార్కెట్లోకి వచ్చిన పత్తి

జమ్మికుంట రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్ యార్డులో సీసీఐ, ప్రైవేట్‌వ్యాపారుల కొనుగోళ్లు గురువారం యధాతథంగా కొనసాగాయి. నిబంధనలు సడలించాలని డిమాండ్‌చేస్తూ జిన్నింగ్‌మిల్లర్లు పత్తికొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అందుబాటులో లేకపోవడంతో జిన్నింగ్ మిల్లర్లు తాత్కాలికంగా పత్తికొనుగోళ్ల బంద్‌ను వాయిదా వేసుకున్నారు. గురువారం మార్కెట్‌యార్డుకు 61 మంది రైతులు 487క్వింటాళ్ల విడిపత్తి, ఐదుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనేసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.6800, కనిష్ఠ ధర రూ.5700 చెల్లించి కొనుగోళ్లుచేపట్టారు. సీసీఐఐదుగురు రైతుల నుంచి 69క్వింటాళ్ల మద్దతు ధర ప్రకారం కొనుగోళ్లు చేపట్టింది.

కాలువలకు వెంటనే మరమ్మతులు చేయాలి

- సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి


చిగురుమామిడి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కాలువలను వెంటనే మరమ్మతు చేయాలని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పలుగ్రామాలను ఆయన సందర్శించారు. దెబ్బతిన్న కాలువలను, వరిపంటలను పరిశీలించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలుమండలాల్లో దెబ్బతిన్న, ప్యాకేజీ-3లో పెండింగ్‌లో ఉన్న పనులు, భూసేకరణ లాంటి కార్య క్రమాలు నిర్వహించడానికి దాదాపు 67కోట్లు కావాలని కోరుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీలో నిలిచిపోయిన పనులకు వెంటనే టెండరు పిలవాలని కోరారు. ఆయనవెంట సీపీఐ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రేకొండలో ఇటీవల వర్షాలకు తెగిన రోడ్లను పరిశీలిస్తున్న చాడ వెంకటరెడ్డి

పారిశ్రామికాభివృద్ధిలో ఎన్టీపీసీ కీలకం

- నేడు ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం
- బహుళ రంగాల్లో ప్రగతి



జ్యోతినగర్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశీయ విద్యుత్ అవసరాలను తీర్చడంతోపాటు ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధిలో ఎన్టీపీసీ కీలకపాత్ర పోషిస్తున్నది. దేశంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో నాల్గవ వంతు ఎన్టీపీసీ అందిస్తోంది. విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న ఎన్టీపీసీ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యాపారాన్ని విస్తరిస్తోంది. థర్మల్ విద్యుత్ కేంద్రాలతో ప్రారంభమైన ఎన్టీపీసీ ప్రయాణం గ్యాస్, నాఫ్తా ఆధారిత ప్రాజెక్టులు, జలసాంప్రదాయేతర (సోలార్, పవన) విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పింది. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో జాయింట్ వెంచర్లు, అనుబంధ సంస్థలతో వ్యాపారాన్ని నిర్వహిస్తున్నది. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్‌గా ఉన్న ఎన్టీపీసీ దశాబ్దం క్రితం ఎన్టీపీసీ లిమిటెడ్‌గా అవతరించింది. 23 బొగ్గు ఆధారిత(థర్మల్), 7 గ్యాస్(నాఫ్తా), 15 సోలార్ ప్రాజెక్టులు, 2 జల విద్యుత్ ప్రాజెక్టులు, ఒక విండ్, 9 జాయింట్ వెంచర్(సంయుకత్త రంగం)లో మొత్తం 48 ప్లాంట్లను నిర్వహిస్తోంది. ప్రస్తుతం 84,849 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంగల సంస్థ 2032 నాటికి 1.28 లక్షల మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించడానికి ప్రణాళికలను రూపొందించింది. 1975 నవంబరు 7న నేషనల్ థర్మల్ పవర్ కార్పొ రేషన్(ఎన్టీపీసీ) పేరుతో పబ్లిక్ సెక్టార్ సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అంచెలంచెలుగా ఎదిగిన ఎన్టీపీసీ శుక్రవారంతో 50 ఏళ్లు పూర్తి చేసుకొని 51వ వసంతంలోకి అడుగు పెడుతున్నది.



రామగుండంలోని ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు

● పలు అవార్డులు

50 ఏళ్లలో ఎన్టీపీసీకి ఉత్పత్తి, సేఫ్టీ, సీఎస్ఆర్, మానవ వనరులు, పర్యావరణ పరిరక్షణ, పరిపాలన, నాణ్యత, బెస్ట్‌ప్లేస్ టూ వర్క్ తదితర అన్ని రంగాలలో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. గతంలోనే ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్‌గా ప్లాట్స్ సంస్థ ఎన్టీపీసీకి ప్రపంచంలో మొదటి ర్యాంకు ప్రకటించింది. ఫోర్బ్స్ ర్యాంకింగ్స్‌లో ఎన్టీపీసీకి 4వ స్థానం, నాలుగు ఆర్థిక సంవత్సరాలుగా డున్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ నుంచి బెస్ట్ పెర్ఫార్మింగ్ సంస్థగా గుర్తింపు సాధిస్తూ వస్తోంది.

● బొగ్గు గనుల నిర్వహణ..

దేశంలో అత్యధిక బొగ్గును ఎన్టీపీసీ వినియోగిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో 300 మిలియన్ టన్నుల బొగ్గును ఉపయోగించింది. యేటా సంస్థ స్థాపిత సామర్థ్యం (థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటు) పెరుగుతుండడంతో బొగ్గును ఎక్కువ మొత్తంలో ఉపయోగించాల్సి వస్తోంది. బొగ్గు కొరతను ఎదుర్కొనడానికి దేశవ్యాప్తంగా 10 బొగ్గు బ్లాకులు(107 బిలియన్ మెట్రిక్ టన్నులు) ఎన్టీపీసీకి ఉన్నాయి. ప్రస్తుతం నెలకొన్న పోటీతో పాటు ముడి ఇంధన సమస్యలను అధిగమించేందుకు ఎన్టీపీసీ లిమిటెడ్ సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి విధానం అమలు చేస్తున్నది. సంస్థ సాంప్రదాయేతర పద్ధతుల ద్వారా చిన్న విద్యుత్ కేంద్రాలను నెలకొల్పేందుకు ప్రణాళికలు రూపొం దించింది. సాంప్రాదాయేతర ఇంధన వనరుల ద్వారా 50,000 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఎన్టీపీసీ భావిస్తున్నది. దీనిలో ప్రధానంగా సోలార్, పవన, జియోథర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టిసారించింది.

రైతులకు కొనుగోలు కష్టాలు

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల్లో 8 శాతం తేమ వచ్చిన పత్తినే కొనుగోలు చేస్తామని అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తి తేమ 8 శాతం ఉంటేనే రూ.8110 మద్దతు ధర చెల్లిస్తోంది. తేమ శాతం అంతరాదని రైతుల పేర్కొంటున్నారు. అయితే తేమ శాతం పెరిగిన కొద్ది మద్దతు ధర తగ్గుతుందని అంటున్నారు. ఇలా షరతులు నిబంధనలతో 12 శాతం తేమ ఉన్న పత్తిని కొనుగోలుకు సీసీఐ అనుమతిస్తోంది. మరోవైపు రైతులు ఎకరం సాగు చేసిన పత్తికి సంబంధించిన 7 క్వింటాళ్ల నిబంధన కూడా అధికారులు సడలించలేదు. ఈ రెండు నిబంధనలతో పత్తి పంట ఎక్కడిక్కడ ఉండిపోయింది. జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ రైతులకు అనుకూలంగా నిబంధనలు మార్చాలంటూ కొనుగోలును నిలిపివేసింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలిస్తున్నాయి

- ప్రవీణ్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ నిబంధనలు సడలించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశీలిస్తున్నాయి. ఎకరానికి ఏడు క్వింటాళ్ల నిబంధన పరిమితిని 12క్వింటాళ్ల వరకు అనుమతించాలనే విషయాన్ని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నారు. రైతులు పత్తిని సీసీఐ కేంద్రాలకు తీసుకువచ్చేటప్పుడు ఆన్‌లైన్ సిస్టం ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలి. కౌలు రైతులు తమ పంటను అమ్ముకోవడానికి వ్యవసాయ అధికారులను సంప్రదించి పత్రాలను అందించాలి.

పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు



- తోటపల్లి రమేష్, పారుపల్లి, రైతు

ఎకరాకు రూ.30 వేల పెట్టుబడి పెట్టి వరి సాగు చేశా. ఇటీవల కురిసిన వర్షాలతో వరి నేలకొరిగింది. హార్వెస్టర్ల పొలంలోకి దిగే పరిస్థితి లేదు. నేలకొరిగిన వరిని కూలీలతో కోయిస్తున్నాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

అభివృద్ధి జరగ లేదనడం సరికాదు

పాలకుర్తి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగుండంలో కూల్చివేతలు తప్ప అభివృద్ధి జరగడం లేదని బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడడం వారి అవివేకానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం అన్నారు. గురువారం బసంత్‌నగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చేస్తున్న అభివృద్ధి పనులను కళ్లు ఉండి చూడలేని ధృతరాష్ట్రుడిగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి గాలిమోటార్లలో తిరిగే బీఆర్ఎస్ నాయకులకు ఎలా తెలుస్తుందని మండిపడ్డారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై బసంత్‌నగర్, అంతర్గాం, రామగుండం చౌరస్తాకు వస్తే చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, మాజీ సర్పంచ్ పర్శవేణి శ్రీనివాస్ యాదవ్, పాత రవిందర్, కాసార్ల కిరణ్, సీపతి సురేష్, కాదాసి తిరుపతి ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ముత్తారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రవికుమార్ తెలిపారు. దరియాపూర్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు గురువారం సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం లాంటి సామాజిక మాధ్యమాలకు వచ్చే అనుమానిత లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. షీటీమ్స్, డయల్ 100 సేవల గురించి వివరించారు. విద్యార్థులు ఫోన్‌కు దూరంగా ఉండి, చదువుపై దృష్టి సారించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సంతోష్ కుమార్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యోతినగర్: సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని ఏసీపీ రమేష్ అన్నారు. కృష్ణానగర్‌లోని ఎస్ఆర్ఎం అపార్ట్‌మెంట్‌లో సైబర్ క్రైమ్, డయల్ 100 నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పలు అంశాలను వివరించారు. రోజురోజుకీ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. సీఐ ప్రవీణ్ కుమార్, ఎన్‌టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, ఎస్సార్ఎం కాంట్రాక్టర్ మాచిడి మహేందర్, మహేందర్ గౌడ్, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

మంథని: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మంథని పోలీసులు సైబర్ నేరాలపై గురువారం అవగాహన నిర్వహించారు. సైబర్ నేరాలపై జాగ్రత్త పై ఎస్ఐ రమేష్ వివరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతు

పెద్దపల్లి రూరల్ , నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాఘవపూర్ ప్రధాన చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద 'వెలగని హైమాస్ట్‌లు' అనే కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి తూముల రవి మరమ్మతు చేయించారు. అధికారులు చర్యలు తీసుకునేలా చేసిన ఆంధ్రజ్యోతికి గ్రామస్థులు, దళిత సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యమాల ద్వారానే సమస్యలకు పరిష్కారం

ఓదెల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారం ఉద్యమాలతోనే సాధ్యమవుతుందని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్ అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. రవీందర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈనెల 15, 16 తేదీల్లో సిఐటియు నాల్గవ మహాసభలు విజయవంతం చేయాలన్నారు. సభలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. పైడిపల్లి నాగయ్య, ఆకుల నరేష్, మహేష్, లక్ష్మీనారాయణ, స్వరూప, పద్మ, భద్రయ్య, ప్రమీల, సారయ్య, సదానందం, పాల్గొన్నారు.

ధాన్యం డ్రై చేసే మిషన్లు ప్రారంభం

మంథని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో ధాన్యాన్ని డ్రై చేసే యంత్రాలను ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్‌లు గురువారం ప్రారంభించారు. రైతుల సౌకర్యం కోసం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రెండు యంత్రాలను మంథని మార్కెట్‌కు మంజూరు చేయించారని తెలిపారు. వీటి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐకేపీ కేంద్రాలు ప్రారంభం

ధర్మారం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): కటికేనపల్లి, కొత్తూరు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్ లావుడియా రూప్లా నాయక్ ప్రారంభించారు. కటికేపల్లిలో కేంద్రాన్ని నిర్వహిస్తున్న మహిళా సంఘ సభ్యులను ఆయన సన్మానించారు. పత్తిపాక ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖమ్మర్‌ఖాన్‌పేట, తండా కే, అబ్బాపూర్ గ్రామాల్లో చైర్మన్ నోముల వెంకట్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు మద్దతు ధరకు అమ్ముకోవాలని, సరైన తేమ శాతంతో తీసుకురావాలన్నారు.

ఓడేడులో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ముత్తారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడేడులో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్ ఆధ్వర్యంలో రోడ్ల వెంబడి పెరిగిన పిచ్చిమొక్కలు, అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. అలాగే మురుగు కాలువల్లో పూడిక తీయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రజలు చెత్తాచెదారాన్ని ఆరుబయట పడేయకుండా ఇంటితోపాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కారోబార్ ప్రభాకర్ ఉన్నారు.

ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

ముత్తారం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలో కొనుగోలు కేంద్రాల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి అన్నారు. కోతలు ప్రారంభమైనా, ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఊసేలేదన్నారు. ఆయా గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటు కోసం రైతులు ఎదురు చూస్తున్నారని, అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులను పరామర్శించకుండా మంత్రి శ్రీధర్‌బాబు హైదరాబాద్‌కే పరిమితమయ్యారని విమర్శించారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

పెద్దపల్లి కల్చరల్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్యులు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వైద్యారోగ్యశాఖ పనితీరుపై సమీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నెలలో 263 ప్రసవాలు జరిగాయని, ప్రసవాల సంఖ్య పెరగడంపై వైద్యులను అభినందించారు. ప్రసవం తర్వాత బాలింతలు, శిశువు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఆర్‌బీఎస్‌కే బృందాలు ప్రభుత్వ స్కూల్‌లను తనిఖీ చేస్తూ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. పోషక లోపాలతో ఉన్న పిల్లల కోసం రామగుండంలో ఎన్ఆర్‌సీ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. టీబీ రోగులకు న్యూట్రిషన్ కిట్, అవసరమైన మందులు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలు అన్ని రకాల వైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోగులకు డయాగ్నోస్టిక్ హబ్ ద్వారా పరీక్షలు నిర్వహించి, ఫలితాలు అందించాలన్నారు. జిల్లా వైద్యారోగ్య అధికారి వాణిశ్రీ అధికారులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పిల్లలకు మెరుగైన విద్యాబోధన అందించాలి

పిల్లలకు మెరుగైన విద్యాబోధన అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో విద్యా ప్రమాణాల పెంపుపై 22 పాఠశాలల హెడ్ మాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యుత్తమంగా పని చేస్తున్న 22 పాఠశాలలను ఎంపిక చేసి అభినందిస్తున్నామని తెలిపారు. పాఠశాలలో మంచి విద్యాబోధన కొనసాగించాలని, తోటి టీచర్లను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలలో మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. మచ్చుపేట పాఠశాల ఊరికి దూరంగా ఉందని, ఆటో ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా ప్రతిపాదనలు పంపాలన్నారు. జిల్లాలో బాగా పని చేసే పాఠశాలలో ఏఎక్స్ఎల్ ల్యాబ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు.

బాల్యవివాహాలను నిరోధించాలి

పెద్దపల్లి, (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిరోధించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా చేపట్టిన బాల్య వివాహాల నిరోధక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్య నేరమని, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆడపిల్ల వయస్సు 18సంవత్సరాలు నిండక ముందే పెళ్ళి చేసుకున్నట్లయితే వాటి వల్ల కలిగే మానసిక శారీరక ఆర్థిక అనర్థాలు వివరించారు. జిల్లా సంక్షేమాధికారి పీ వేణుగోపాల్, జనరల్ స్పెషలిస్ట్ సుచరిత, డీహెచ్ఈడబ్ల్యూ కో ఆర్డినేటర్ దయ అరుణ పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాలను ప్రారంభించాలి

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): పక్షం రోజుల్లో మానసిక దివ్యాంగుల పాఠశాలను ప్రారంభించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మానసిక దివ్యాంగుల పాఠశాల, వృద్ధాశ్రమం, కేంద్రీయ డ్రగ్ స్టోర్ కేంద్రాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న దివ్యాంగుల పాఠశాలను పక్షం రోజుల్లో ప్రారంభించాలన్నారు. వృద్ధాశ్రమ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. దివ్యాంగుల పాఠశాలలో అడ్మిషన్ కోసం 40 దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో తల్లిదండ్రులతో సంప్రదిస్తూ పిల్లలు రెగ్యులర్‌గా పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. వారికి ఆట వస్తువులు, బోధన పరికరాలు సిద్ధం చేయాలన్నారు. అలాగే డ్రగ్ స్టోర్‌ను పరిశీలించి రామగుండంకు మందుల సరఫరా రెగ్యులర్‌గా ఉండాలని తెలిపారు. స్టోర్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, స్టోర్ ఫార్మసీ సిబ్బంది శ్రీనివాస్ ఉన్నారు.

నేడు వందేమాతరం గీతాలాపన

పెద్దపల్లి, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): వందేమాతర గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఉదయం 9.45గంటలకు కలెక్టర్ భవన సముదాయం ఆవరణలో సామూహిక గీతాలా పన జరుగుతుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రక టనలో తెలిపారు. బంకించంద్ర చటర్జీ వందేమాతర గేయ రచన చేసి 150 సంవత్సరాలు పూర్తయిందని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో గీతాలాపన నిర్వహిం చాలని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం



మౌన దీక్ష చేస్తున్న నాయకులు

పెద్దపల్లి కల్చరల్ నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం ఆగదని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష అన్నారు. గురువారం పట్టణంలోని అమర్‌నగర్ చౌరస్తా వద్ద మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మౌన దీక్ష చేపట్టారు. ఉష మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్ల సాధన కోసం రాజకీయ ఒత్తిడి పెంచాలన్నారు. కొందరు ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నల్లవెల్లి శంకర్, మహిళా కన్వీనర్‌గా సిరవేన స్వప్న, జిల్లా కన్వీనర్లుగా సలేంద్ర కొమరయ్య యాదవ్, బోల్లం భూమేష్, గుడ్ల సమ్మయ్య, మీడియా ఇన్‌చార్జిగా అబ్దుల్ మాలిక్‌ను నియమించారు. నాయకులు నల్లవెల్లి శంకర్, శిలారపు పర్వతాలు యాదవ్, సలేంద్ర కొమురయ్య, సిలవేరు స్వప్న, భాస్కర్ యాదవ్, శివంగారి సతీష్, రాజగోపాల్, బొంకూరి సురేందర్ సన్నీ, తిరుపతి, సదానందం, కంకటి శ్రీనివాస్, భూమేష్, జ్యోతి, రవీందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

ధర్మారం, నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయిమణికంఠ మాడ్రన్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి విష్ణువర్ధన్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 7న మహబూబ్ నగర్‌లో జరిగే 69వ అండర్ 17 విభాగంలో పాల్గొనన్నుట్లు పాఠశాల కరస్పాండెంట్ జైన సురేష్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి తెలిపారు. విద్యార్థి విష్ణువర్ధన్, పీఈటీ సాయికుమార్‌ను వారు అభినందించారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

ముత్తారం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మంపల్లి శివారులోని 615, 617, 618 సర్వే నెంబర్‌లో సుమారుగా వెయ్యి ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు లెక్కలు చూపిస్తున్నారన్నారు. గ్రామ అవసరాలకు భూమి ఇవ్వాలని కోరితే అధికారులు పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన భూమి అన్యాక్రాంతం అవుతుందని, ప్రభుత్వ భూమిని కాపాడి భూమిలేని నిరుపేదలకు పంచాలన్నారు. ఆట స్థలం, ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం కేటాయించాలని తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. కొందరు భూమిని ఆక్రమించుకొని విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆయన కోరారు.

రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

సుల్తానాబాద్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు అన్నారు. తొగర్రాయి, మంచిరామి, కనుకుల, రామునిపల్లి, అల్లీపూర్, మద్దికుంట, సుద్దాల తదితర గ్రామాల్లో సింగిల్ విండో సోసైటీ అధ్యక్షులతో కలిసి గురువారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను పారదర్శకంగా నిర్వహించాలని, ఎలాంటి కటింగ్‌లు లేకుండా కాంట వేయాలన్నారు. తేమ శాతం వచ్చేలా ధాన్యం ఆరబెట్టుకొని తీసుకురావాలని సూచించారు. కనుకుల, సుద్దాల చైర్మన్లు కోట వీణ, రాజమల్లారెడ్డి, గడ్డం మైపాల్‌రెడ్డి, డైరెక్టర్ ఇల్లెందుల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు పోలు అంజయ్య, మల్యాల శ్రీనివాస్, కాసర్ల అనంతరెడ్డి, మీస సత్తయ్య, వైస్ చైర్మన్ కొమ్మిడి వెంకట్రామిరెడ్డి, నారాయణ, మినుపాల డిల్లేశ్వర్‌రావు, వెంగల్ రావు, ఒజ్జ సమత, పుట్ట సదయ్య, సీతఊటలు దేవేందర్, సతీష్ పాల్గొన్నారు.

సుగ్లాంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార శాఖ అధికారిని శ్రీమాల ప్రారంభించారు. డైరెక్టర్లు గాజుల రాజమల్లు, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు పడాల అజయ్ గౌడ్, కల్లెపల్లి జానీ, నాయకులు సంతోష్‌రావు, శేఖర్, చక్రధర్, సత్యనారాయణ రావు, నోముల రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లీపూర్ గ్రామాన్ని సందర్శించిన అధికారులు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

సుల్తానాబాద్, నవంబరు6(ఆంధ్రజ్యోతి): అల్లీపూర్ మంచినీటి బావిపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం మిషన్ భగీరథ డీఈ సతీష్, జేఈ శ్రీకాంత్, ఎంపీడీఓ సమ్మిరెడ్డి, కార్యదర్శి అభిజిత్‌లు గొల్లపల్లిలోని మంచినీటి బావిని పరిశీలించారు. తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు నీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా వస్తున్న సరిపోవడం లేదని ప్రజలు పేర్కొన్నారు. గొల్లపల్లిలోని పురాతన బావి ప్రభుత్వానికి సంబంధించి కాదని, ఒక రైతు తాగు నీటికి అవసరాలకు ఇచ్చినట్లు స్పష్టమైంది. గొల్లపల్లి, ఎస్సీకాలనీ, అల్లీపూర్ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి 40 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని, స్థల పరిశీలన చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అల్లీపూర్ బస్టాండ్ ప్రాంతంలో అలాగే జడ్పీ హైస్కూల్ నుంచి గొల్లపల్లి రోడ్డువరకు ఉన్న ప్రధాన రోడ్‌లో హైమాస్ట్ లైట్ల అవసరాన్ని ప్రజలు అధికారులకు తెలిపారు.



అల్లీపూర్‌లో మంచినీటి బావిని పరిశీలిస్తున్న అధికారులు

పశువులకు టీకాలు వేయించాలి

పెద్దపల్లి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రాగినేడు పశు వైద్యాధికారి అఖిల్ రాజ్ అన్నారు. బుధవారం బొంపల్లి గ్రామంలో పశువులకు టీకాలు వేశారు. వైద్యులు అఖిల్ రాజ్ మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకకుండా పాడి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గోపాలమిత్రలు, పాడి రైతులు పాల్గొన్నారు.

పాస్టర్ల వృత్తి పవిత్రమైంది

మంథని, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ల వృత్తి పవిత్రమైందని దైవజనులు హనుమంతరావు అన్నారు. సీయోను ప్రార్థన మందిరంలో గురువారం బైబిల్ శిక్షణ ముగింపులో మాట్లాడారు. సమాజంలో శాంతిని నెలకొల్పుతూ ఆధ్యాత్మిక చింతన వైపు ప్రజలను నడిపిస్తున్నారన్నారు. పాస్టర్లు మహేష్, దయారాజు, ఆహరోన్, మధుకర్, సురేష్, మార్క్, కుమార్, ప్రసాద్, రమేష్, జోసఫ్, కుమార్‌లు పాల్గొన్నారు.

అధిక పరీక్ష ఫీజు వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫీజును అధికంగా వసూళ్ళు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి మాధవికి టీఎస్ఎస్ఎఫ్ నాయకులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. టీఎస్ఎస్ఎఫ్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు వాజిద్ మాట్లాడారు. పరీక్ష ఫీజు రూ. 125 నుండి 150 వరకు ఉంటుందని, పలు పాఠశాలలు 2000 వరకు పరీక్ష ఫీజులు వసూలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అదనపు పరీక్ష ఫీజు వసూలు చేసిన పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సతీష్, రాజేష్, వెంకటేష్ ఉన్నారు.

ఆర్‌వోబీలు నిర్మించాలి

ఓదెల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొలనూర్ 34వ, ఓదెల 31వ, రైల్వే గేట్ల వద్ద అండర్ బ్రిడ్జిలను నిర్మించాలని డిఎం ముత్యాల నాయుడుకు డివిజనల్ రైల్వే సభ్యుడు అనుమాస శ్రీనివాస్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ గేట్ల వద్ద రద్దీ ఉంటుందని, గేట్లు దాటాలంటే కనీసం రెండు గంటల సమయం పడుతుందని తెలిపారు. సమస్యను ఎంపీ గడ్డం వంశీ కృష్ణ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని శ్రీనివాస్ తెలిపారు.



కోలిండియా పోటీలకు కళాకారుల ఎంపిక

కోల్‌సిటీటౌన్, నవంబర్ 6(ఆంధ్రజ్యోతి): నాగ్‌పూర్‌లో డిసెంబర్‌లో జరుగనున్న కోలిండియా సాంస్కృతిక పోటీలకు ఎంపికైన ఆర్‌జీ-1, 2 ఏరియాలకు చెందిన కళాకారులను అధికారులు అభినందించారు. ఇటీవల మందమర్రిలోని సీఈఆర్ క్లబ్ రెండు రోజులపాటు సింగరేణి కంపెనీ స్థాయి పోటీలలో ఆర్‌జీ-1, 2 ఏరియాలకు చెందిన కళాకారులు దార సుశీల, దుర్గా కోటేమౌత్, ఆదిల్ మహ్మద్, సానా జలపతి, పుల్యాల సతీష్, పొన్నాల శంకర్, నోవా శ్యాం, కనకం రమణయ్య, బంభక్ రాకేష్, బోయిని రాజారాం, పులిపాక ప్రేమ్‌కుమార్‌లు వివిధ విభాగాల్లో ప్రతిభ కనపర్చి కోలిండియా సాంస్కృతిక పోటీలకు ఎంపికయ్యారు. కోలిండియా స్థాయి పోటీలకు ఎంపికయిన కళాకారులను ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్, ఆర్‌జీ-2 జీఎం బండి వెంకటయ్య, సింగరేణి అధికారులు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్లు రమేష్, నరేందర్‌రెడ్డి, కార్మికులు అభినందించారు.

వీటీసీలో నేరాలపై అవగాహన సదస్సు

రామగిరి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పన్నూరు గ్రామ పంచాయతీలో సైబర్ జాగృత దివాస్ ను పురస్కరించుకొని వీటీసీలో శిక్షణ పొందుతున్న ట్రైనీ అభ్యర్థులకు గురువారం అవగాహన కల్పించారు. మంథని సిఐ రాజు నేరాల పై అవగాహన కల్పించారు. ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

12న కొత్తగూడెంలో కారుణ్య నియామకాలు అందజేత

గోదావరిఖని, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మెడికల్ పూర్తి చేసి ఇప్పటివరకు నియామక పత్రాలు పొందని దాదాపు 473 మంది కారుణ్య అభ్యర్థులు ఈ నెల 12వ తేదీన కొత్తగూడెం వేదికగా నియామక పత్రాలు అందుకోనున్నారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు చేతుల మీదుగా నిర్వహించనున్నట్టు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బీ జనక్ ప్రసాద్ తెలిపారు. పరిపాలనా కారణాలతో ఎన్నో నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఈ నియామక పత్రాల జారీ కోసం నిరంతరం యాజమాన్యం, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినట్టు జనక్ ప్రసాద్ తెలిపారు.

కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

గోదావరిఖని, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆర్‌జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో గురువారం గనులు, డిపార్ట్‌మెంట్‌లలో ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆర్‌జీ-1 బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, ఉపాధ్యక్షులు మాదన మహేష్, సంకె అశోక్, సహాయ కార్యదర్శి రంగు శ్రీను మాట్లా డుతూ పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కమిటీల పేరు మీద కాలయాపన చేయవద్దని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ కార్మికుల హక్కుల కోసం కృషి చేస్తున్నప్పటికీ కొన్ని కార్మిక సంఘాలు గనులపై అసత్య ప్రచారాన్ని చేస్తున్నాయన్నారు. 150మస్టర్లు తప్పనిసరి నిబంధన తీసుకొస్తున్న క్రమంలో యాజమాన్యానికి ఏఐటీయూసీ మద్దతుగా ఉండి కార్మికులను మోసం చేస్తున్నదని అసత్య ప్రచారం చేస్తున్న సంఘాలను కార్మికులు నమ్మవద్దని పేర్కొన్నారు. సింగరేణికి రావలసిన కోట్లాది రూపాయల బకాయిలపై ఎందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం లేదని విమర్శించారు. ఏఐటీయూసీ నాయకులు ఎస్ వెంకట్‌రెడ్డి, బోగ సతీష్ బాబు, దొంత సాయన్న, చక్రపాణి, కె శ్రీనివాసరావు,సయ్యద్ సోహేల్, సిద్దమల్ల రాజు, సిర్ర మల్లికార్జున్, గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్, రాజు, దాసరి శ్రీనివాస్, దాసరి అనిల్, అశోక్, మైన్స్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రామగిరి, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో గని మేనేజర్‌లకు పలు డిమాండ్‌లపై అధికారులకు వినతి పత్రం అందజేశారు. మెడికల్‌బోర్డు, సొంత ఇంటి పథకం, అలవెన్స్‌పై పెర్క్స్ డిస్మిస్ కార్మికులకు మారుపేర్లు, 150 మాస్టర్ల ఎత్తివేత డిమాండ్‌ల పై ఏఐటియుసి నాయకులు వినతి పత్రాలను అందజేశారు. వైవిరావు, జూపాక రాంచందర్, బండారి క్రాంతి, ఎమ్మార్సీరెడ్డి, డిటి రావు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): గుర్తింపు సంఘం ఏఐటీయూసీతో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలో యాజమాన్యం అంగీకరించిన ఒప్పందాలను అమలు చేయాలని ఆర్జీ-2 పరిధిలోని గనులు, డిపార్ట్‌మెంట్లపై నాయకులు అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. మెడికల్ బోర్డును ఏర్పాటు చేసి పాత విధానంలో ఇన్వాలిడేషన్ ఇవ్వాలని, మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ పరీక్షను వెంటనే నిర్వహించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రకాష్, జీ రవీందర్, శ్యాంసన్, సాంబశివరావు, మహేందర్, రాజు, రాజసాగర్, శంకర్, రవికుమార్, సంపత్, రమేష్ పాల్గొన్నారు.

ఓసీపీ-1 ప్రాజెక్టులో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు.

గ్రూప్-2 ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2లో ఉద్యోగం సాధించిన ఓసీపీ-1 ఉద్యోగి బోగ సతీష్‌ను కార్మికులు గురువారం సన్మానించారు. గజమాలతో సన్మానించి ఉద్యోగంలో చేరుతున్న సతీష్‌కు వీడ్కోలు పలికారు. ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు, సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతిలు మాట్లాడారు. ఓసీపీ-1 కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బోగ సతీష్ గ్రూప్-2లో 331వ ర్యాంక్ సాధించినట్టు తెలిపారు. హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ డిపార్ట్‌మెంట్ కరీంనగర్ కార్యాలయంలో అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విధుల్లో చేరుతున్నారన్నారు. ఓసీపీ-1 మేనేజర్ పాపయ్య, సేఫ్టీ ఆఫీసర్ అజయ్‌కుమార్, అడిషనల్ మేనేజర్ వినాయక్, కార్మిక సంఘాల నాయకులు తిరుపతిరావు, అల్లం తిరుపతి, రమేష్‌రావు, కొండల్‌రెడ్డి, రామచందర్‌రావు, రఘునాథ్, కామ తిరుపతి, భాస్కర్, నవీన్, వెంకటరమణ, రామస్వామి పాల్గొన్నారు.

ఉత్పత్తి, రవాణా లోటు భర్తీ చేయాలి

గోదావరిఖని, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల తొలి అర్థ సంవత్సరంలో అన్ని విభాగాల్లో వెనకబడి ఉన్నా మని, వర్షాలు తగ్గినందున ఉత్పత్తిని గణనీయంగా పెంచి లోటును భర్తీ చేసుకొని లక్ష్యాలు సాధించాలని సీఎండీ ఎన్ బలరామ్ అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లకు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయన సంస్థ డైరెక్టర్లు, కార్పొరేట్ విభాగాల జనరల్ మేనే జర్లతోపాటు అన్ని ఏరియాల్లోని జనరల్ మేనేజర్లతో సమావేశమై ఏరి యాల వారీగా ఉత్పత్తి, రవాణా అంశాలను సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెలలో సాధించాల్సిన 72లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యానికి రోజుకు 2.4లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణా సాధించాలన్నారు. రోజుకు కనీసం రూ.13.75 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాల్సి ఉంటుందని ఆదేశించారు. నిబంధనల ప్రకారం ఏయే అధికారికి లేదా ఉద్యోగికి ఏ అవకాశాలు రావాలో అవి పొందే విధంగా సంబంధిత శాఖలు చర్యలు తీసుకో వాలన్నారు. భూగర్భ గనుల్లో తనిఖీలు పెంచా లని సూచించారు. కొత్త ప్రాజెక్టులపై ఆయన సమీక్ష నిర్వహించారు. డైరెక్టర్లు ఎల్‌వీ సూర్య నారాయణ, కే వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, ఎం తిరుమలరావు, ఈడీ కోల్ మూమెంట్ బీ వెంకన్న, అడ్వైజర్ ఫారెస్ట్రీ మోహన్ పరిగేన్, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్, మార్కెటింగ్ టీ శ్రీనివాస్, జీఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

ఆర్జీ-2లో డిజిటల్ లైఫ్ సర్టిఫికేషన్ క్యాంపెయిన్

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎంపీఎఫ్ రీజినల్ కార్యాలయం గోదావరిఖని ఆధ్వర్యంలో గురువారం ఆర్జీ-2 ఏరియాలో డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ ప్రారంభమైంది. అఫిషియేటింగ్ జీఎం రాముడు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏరియా పర్సనల్ ఏజీఎం అరవిందరావు మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే ఈకార్యక్రమాన్ని రిటైర్మెంట్ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటి రోజు 82 మంది రిటైర్డ్ కార్మికులు తమ లైఫ్ సర్టిఫికేట్లు సమర్పించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు వంశీధర్, వేణు, వెల్ఫేర్ ఆఫీసర్లు సాయికృష్ణ, అజీజ్, సీఎంపీఎఫ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.